క్లుప్తంగా

విద్యార్థులకు మాక్ పోలింగ్



దొండపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో మాక్ పోలింగ్‌లో విధులు నిర్వహిస్తున్న విద్యార్థులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని దొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాదిరి ఎన్నికలు (మాక్ పోలింగ్) నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల మాదిరిగా విద్యార్థులు నామినేషన్, ప్రచారం, ఓటింగ్ నిర్వహించి లీడర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఖాసీ మాట్లాడుతూ.. ఎన్నికల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి మాక్ పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, శ్రీనివాసచారి, సైదులు, బాలస్వామి, అడవి రాముడు, మంజుల, జాన్సీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'రేస్' ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ వసంతావెంకటరెడ్డి

కోదాడ అర్బన్ : జేఈఈ మెయిన్స్ సెషన్–1 ఫలితాల్లో కోదాడ పట్టణానికి చెందిన రేస్ ఐఐటీ, మెడికల్ అకాడమీ సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ బాణాల వసంతావెంకటరెడ్డి మంగళవారం తెలిపారు. తమ కళాశాలలో చదువుతున్న వేమూరి రామ్‌చరణ్ (97.86), కర్నాటి మహాలక్ష్మి (97.63), ఎండీ సానియా తబ్సుమ్ (97.39), ఉస్తెల సుభేష్‌రెడ్డి (97.21), ఉయ్యాల రక్షిత సమైఖ్య (96.56) సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆమె అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ఆర్కే, కేవీకే, ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి విరాళాలు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో భోజనశాల నిర్మాణానికి మంగళవారం మండల కేంద్రానికి చెందిన వందనపు సూర్యప్రకాశరావు భారతమ్మ దంపతులు రూ.25 వేలు, అనంతగిరి మండలం అమీనాబాద్‌కు చెందిన దివంతగ రిటైర్డు విద్యాధికారి గోపతి భిక్షమయ్య, పుష్పావతి దంపతుల పేరిట వారి కుమారుడు గోపతి రవికుమార్ రూ.25 వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, గౌరవ సలహాదారు పసుపులేటి భిక్షం, భోనగిరి ఉపేందర్ పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు రమాబాయి కృషి



రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

హుజూర్‌నగర్ : సమసమాజ స్థాపనకు రమాబాయి అంబేద్కర్ విశేషంగా కృషి చేశారని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు మంద రవి అన్నారు. మంగళవారం పట్టణంలో బీఎస్పీ ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.సుబ్బుగౌడ్, కె.నరసింహారావు, మండల కన్వీనర్ ఎం.మట్టపల్లి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆక్రమిస్తాం



కోదండరామాపురంలో సభ్యత్వాలు నమోదు చేస్తున్న ములకలపల్లి రాములు

మునగాల : ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేయకపోవడం శోచనీయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు అన్నారు. మంగళవారం మండలంలోని కోదండరామాపురంలో ఆయన వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో నిర్మించిన 50 డబుల్ బెడ్ రూం ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి పంపిణీ చేయాలని, లేనియెడల అర్హులైన లబ్ధిదారులతో కలిసి ఆక్రమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సొంపంగు జానయ్య, జిల్లా కమిటీ సభ్యుడు ఆరె.రామకృష్ణారెడ్డి, నాయకులు సురేష్, గుండెపంగు ఉమ, గుండెపంగు నవీన్, ఇవాళ రత్న, ప్రసాద్, వెంకన్న పాల్గొన్నారు.

బేతవోలు జాతర చూసొద్దామా..

9 నుంచి కనకదుర్గమ్మ జాతర (బండ్ల పండుగ) ప్రారంభం

- మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- 10న కోలాటాలు, లైటింగ్ ప్రభలు
- రెండు రోజుల పాటు ఎడ్ల పందేలు



ముస్తాబైన బేతవోలులోని కనకదుర్గమ్మ ఆలయం

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించే కనకదుర్గమ్మ జాతర (బండ్ల పండుగ) ఈ నెల 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్నది. దీంతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ప్రతి ఏడాది శివరాత్రికి ముందు వచ్చే గురు, శుక్ర, శనివారాల్లో ఈ జాతర జరుపుకోవడం ఆ గ్రామ ప్రజల ఆనవాయితీ. గురువారం రాత్రి రైతులు ప్రభ బండ్లను అలంకరించి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అక్కడే బండ్లను వదలివెళ్తారు. శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించిన అనంతరం వన భోజనాలకు వెళ్తారు. శనివారం ప్రభలను ఇంటికి తీసుకెళ్లడం ఇక్కడి ఆచారం. కాగా వివిధ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే కోలాట ప్రదర్శనలు ఆకర్షణీయంగా నిలుస్తాయి. నియోజకవర్గ పరిధిలో జరిగే అతి పెద్ద పండుగ ఈ బండ్ల పండుగ. జాతర సందర్భంగా గ్రామంలో మూడు రోజులు కోలాహలంగా ఉంటుంది. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోదాడ రూరల్ సీఐ నాగదుర్గాప్రసాద్, ఎస్ఐ చల్లా శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో 100 మందికి పైగా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

10న రాత్రి లైటింగ్ ప్రభలు

బీఆర్‌ఎస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో భారీగా లైటింగ్ ప్రభలు, డ్యాన్స్‌లు, మ్యూజికల్ లైట్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, బీజేపీ, టీడీపీల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆలయం వద్ద ఎడ్ల పందేలు

బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, ఎంపీటీసీలు ధనమూర్తి, సైదాబాబు, పశు ప్రదర్శన కమిటీ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజుల ఎడ్ల పందేలు ఉంటాయి. ఈ పోటీలను కనకదుర్గమ్మ ఆలయం వద్ద గల ప్రదేశంలో నిర్వహించనున్నారు. అలాగే సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కోలాట పోటీలు జరగనున్నాయి.

జాతరకు రానున్న ప్రముఖులు

జాతర వద్ద ఈ నెల 10వ తేదీన రాత్రి జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. బీఎస్పీ పార్టీ వారు నిర్వహించే కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్, బీజేపీ నాయకులు నిర్వహించే కార్యక్రమానికి ఆ పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, బీఆర్‌ఎస్ నుంచి స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, కాంగ్రెస్ పార్టీ నిర్వహించే కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ పద్మావతిలో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరుకానున్నారు.

పోటాపోటీగా కోలాట ప్రదర్శనలు

జాతర సందర్భంగా వివిధ పార్టీల ఆధ్వర్యంలో శుక్ర, శనివారం రెండు రోజుల పాటు మధ్యాహ్నం సమయంలో పోటాపోటీగా కోలాట ప్రదర్శనలు, కోలాట పోటీలు ఉంటాయి. అధికార బీఆర్‌ఎస్ పార్టీ వారు రెండు వర్గాలుగా ఏర్పడి రెండు వేర్వేరు ప్రదేశాల్లో కోలాట పోటీల ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఒక వర్గం రథశాల సెంటర్‌లో, మరో వర్గం బస్టాండ్ సెంటర్ నుంచి పోలేనిగూడెం వెళ్లే రోడ్డులో నిర్వహిస్తారు. కాంగ్రెస్ పార్టీ వారు బస్టాండ్ సెంటర్ వద్ద, సీపీఐ వారు గ్రామపంచాయతీ పక్కన, సీపీఎం వారు ప్రాథమిక పాఠశాల వద్ద, టీడీపీ వారు ఎన్టీఆర్ విగ్రహం వద్ద, బీఎస్పీ వారు అంకమ్మ గుడి దగ్గర కోలాటాలు వేయనున్నారు.

వైభవంగా స్వామివారి చక్రస్నానం



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని ఫణిగిరి గట్టుపై వెంచేసి ఉన్న సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకీలో చక్ర పెరుమాళ్లను ఉంచి గట్టు చుట్టూ ప్రదిక్షణ గావించారు. మహా మండపంలో పంచసూక్తలతో అభిషేకించారు. నీరాజనం మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా సప్తస్వర శ్రీనివాస భజన మండలి వారి సాంప్రదాయ కీర్తనలు, మధుర గీతాలు భక్తులను అలరించాయి. రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం నిర్వహించిన డాన్స్ బేబీ డాన్స్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, స్థానాచార్యులు, అర్చకులు, ఆలయ అభివృద్ధి సమితి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

గట్టుపై ఆలయంలోని స్వామివారికి మాజీ ఎమ్మెల్యే పద్మావతి సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ పూజారులు ఆమెకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తన్నీరు మల్లికార్జున్, డీవీ, ఎ.అప్పిరెడ్డి, సీహెచ్ వీరారెడ్డి, చక్రధర్‌రావు, వీరబాబు, సుదర్శన్, రాము తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు నిరాశను మిగిల్చిన బడ్జెట్

పాలకవీడు : రాష్ట్ర బడ్జెట్ బీసీలను తీవ్ర నిరాశకు గురి చేసిందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ధనుంజయనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీల అభ్యున్నతికి కేవలం రూ.6వేల కోట్లు కేటాయించడం దారుణమన్నారు.

పేదల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు సరిపడా నిధులు కేటాయించలేదని అసహనం వ్యక్తం చేవారు. కాంట్రాక్టు కార్మికుల పర్మినెంట్, ఆశ కార్యకర్తల జీతాల పెంపు, ఇళ్ల నిర్మాణాలకు తగిన నిధులు, రేషన్ కార్డుల పంపిణీ అంశాలపై బడ్జెట్‌లో ప్రాధాన్యం లేదన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన ప్రభుత్వం

గరిడేపల్లి : తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువతకు ప్రాధాన్యం కల్పించకుండా మోసం చేసిందని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి కొలిపాక వంశీకృష్ణ ఒక ప్రకటనలో విమర్శించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ. 3016 ఇస్తామని, తన మ్యానిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేశారని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్లపై స్పష్టమైన ప్రణాళిక లేదని, కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య ప్రస్తావన రాలేదని, పేదలకు సొంత స్థలంలో ఇళ్లు కట్టుకునే వారికి ఐదు లక్షలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మూడు లక్షలు మా త్రమే అంటున్నారని, రైతులకు రుణమాఫీ లేదని, దళితులకు మూడేకర భూమి ఇవ్వలేదని అన్నారు. మొత్తానికి ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారిడిగానే మారిందని విమర్శించారు.

కరెంట్ కోతతో రైతులకు కష్టాలు

మేళ్లచెరువు : మండలంలో కరెంట్ కోతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా వ్యవసాయానికి కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక సతమతమవుతున్నారు. నీరు సరిపోక పొలాలు ఎండిపోతుండడంతో కరెంటు కోసం పొలాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. ఈ విషయమై మండల స్థాయి విద్యుత్ అధికారికి ఫోన్ చేసి సప్లయ్ ఎప్పుడు వస్తుందని అడిగినా వారు నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 18 గంటలు ఇస్తున్నట్లు చెప్పుకుంటుంది కానీ రోజులో 8 గంటలు కూడా త్రీఫేజ్ కరెంట్ రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలు పెంచాలి

నడిగూడెం : గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు మల్లెల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 12 నుంచి 28 వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పాదయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం నడిగూడెంలో ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, జీఓ 60 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. అలాగే మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కూడా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగరాజు, వెంకన్న, లింగయ్య, శ్రీను, మధుసూదన్, శ్రీకాంత్, గుర్వయ్య, పాల్గొన్నారు.

ఎంపీటీసీ రాజుకు నివాళి

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరం ఎంపీటీసీ, బీక్యాతండా గ్రామానికి చెందిన గుగులోతు రాజు (75) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే చందర్‌రావుతో పాటు పలువురు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా కల్పించారు. నివాళులర్పించిన వారిలో డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, సర్పంచ్ బాణోతు అంబేద్కర్, అన్నెం అంజిరెడ్డి, రాములునాయక్, సైదానాయక్, పలు పార్టీల నాయకులు ఉన్నారు.

ముగిసిన చిన్నగట్టు జాతర



చిన్నగట్టు జాతరలో నృత్యాలు చేస్తున్న మహిళలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరంలో లింగమంతులస్వామి (చిన్నగట్టు) జాతర ముగిసింది. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చంద్రపట్నం, గాపు పట్టు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు ఓ లింగా అంటూ కటార్లతో విన్యాసాలు, తదితర కార్యక్రమాలతో ఆడిపాడారు. అనంతరం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, వైస్ ఎంపీపీ నింగత సైదమ్మ, సర్పంచ్ గుజ్జుల సుజాతలు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమరబోయిన మట్టయ్య, చీపిరి సైదయ్య, భిక్షం, లింగరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లైటింగ్ ప్రభను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే

జాతరలో సోమవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను (లైటింగ్ ప్రభ) కోదాడ మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు నలమాద పద్మావతిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సింగతల సైదమ్మ, మాజీ సర్పంచ్ ఉస్తెల గురవారెడ్డి, భూక్యా మంజీనాయక్, ఆదిరెడ్డి, కళాకారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రక్షణ గోడ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



చాకిరాల సమీపంలో వంతెన వద్ద రక్షణ గోడ పనులు చేపట్టిన అధికారులు

నడిగూడెం : మండల పరిధిలోని చాకిరాల, కాగిత రామచంద్రాపురం గ్రామాల వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాల్వపై ఉన్న వంతెనల వెంట రక్షణ గోడ లేక కాల్వ కట్ట ప్రమాదకరంగా మారింది. దీంతో చకిరాల వద్ద మూడేళ్ల క్రితం స్కార్పియో వాహనం కాల్వలోకి దూసుకెళ్లి ఆరుగురు జలసమాధి అయ్యారు. కాగా సాక్షి దినపత్రికలో పలుమార్లు 'ప్రమాదకరంగా వంతెనలు' అనే శీర్షికతో ప్రచురించడంతో ఎన్ఎస్పీ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. మంగళవారం చాకిరాల వంతెన వద్ద ఇరువైపులా రక్షణ గోడ నిర్మాణపు పనులను ప్రారంభించారు. అలాగే కాగిత రామచంద్రాపురం వద్ద కూడా పనులు చేపట్టనున్నారు. దీంతో ఆ వంతెనల మీదుగా వెళ్లే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరిస్తా



ఆలయ నిర్మాణ నిర్వాహకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరంలో స్వయంభు వైకుంఠ బాల ఉగ్ర నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి తనవంతు సహకరిస్తానని మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. మంగళవారం ఆమె స్వామివారిని దర్శించుకుని మాట్లాడారు. కమిటీ నిర్వాహకులు, స్థానికులను ఆలయ నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. మార్చి 10న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నలజాల జగన్నాథం, పూజారి లక్ష్మీనరసింహమూర్తి, స్థానికులు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. బస్టాండ్ దుర్గంధం



బస్టాండ్ ఆవరణలో మురుగుదొడ్ల పైప్ లైన్ పగిలిన ప్రదేశం

కోదాడఅర్బన్ : ఆర్టీసీ బస్సు ప్రయాణమే సురక్షితం .. ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేయలాంటూ ప్రచారం చేస్తున్న ఆర్టీసీ అధికారులు బస్టాండ్ పరిశుభ్రతపై మాత్రం దృష్టి పెట్టడంలేదు. దీంతో కోదాడ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూసే ప్రయాణికులు దుర్గంధాన్ని భరించాల్సి వస్తోంది. బస్టాండ్‌లో మరుగు దొడ్ల పైపు లైన్ పగిలిపోయి వ్యర్థాలు బయటికొచ్చి దుర్వాసన వెదజల్లుతోంది. అయినా ఆర్టీసీ అధికారులు మాత్రం మరమ్మతులు చేపట్టలేదు. బస్టాండ్‌లో కంపు భరించలేక ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. అదేవిధంగా బస్టాండ్‌లో చెత్తచెదారం పేరుకుపోయినా తొలగించే నాథుడు కరువయ్యారని ప్రయాణికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ బడుల్లో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



మఠంపల్లి : అంత్యాతండాలో ప్రభుత్వ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

మఠంపల్లి : ప్రభుత్వం మన ఊరు– మన బడి పథకంతో ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మండలంలోని అంత్యతండాలో గల ఎంపీపీఎస్ పాఠశాలలో మన ఊరు– మన బడి కింద రూ.17 లక్షలతో పాఠశాల అభివృద్ధి పనులు పూర్తిచేయగా మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మన ఊరు –మన బడి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని అన్నారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపడుతుందన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీ బానోతు జగన్ నాయక్, ఎంఈఓ పానుగోతు చత్రునాయక్, హెచ్ ఎం ఎస్‌కే మస్తాన్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం



హుజూర్‌నగర్ : గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో మఠంపల్లి మండలానికి చెందిన వివిధ పార్టీల వారు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణనాయక్, మన్నెం శ్రీనివాసరెడ్డి, కుర్రి సైదులు, నవీన్‌నాయక్, వస్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు.. బీఆర్ అంబేద్కర్



గుండ్లపహాడ్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పాలకవీడు : అంబేద్కర ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్లపహాడ్ గ్రామంలో ఓజో ఫౌండేషన్ సహకారంతో అంబేద్కర్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని జెడ్పీటీసీ బుజ్జి మోతీలాల్, ఓజో ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే దేశంలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, సమానత్వం అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రాపోలు నవీన్‌కుమార్, నాయకులు నాగేశ్వరరావు, కృష్ణారావు, నీమానాయక్, సైదులు, ఏసు, ప్రవీణ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగమంతుల జాతరలో ఘనంగా చంద్రపట్నం

- నేడు ఎమ్మెల్యే గృహానికి దేవరపెట్టె తరలింపు



దేవరపెట్టె వద్ద చంద్రపట్నం వేసిన అర్చకులు

కోదాడఅర్బన్ : పట్టణంలోని చెరువు కట్టపై ఉన్న బోడిగుట్టపై జీర్ణోద్ధరణ చేసిన లింగమంతులస్వామి జాతరలో మంగళవారం స్వామివారి దేవర పెట్టె ముందు చంద్రపట్నం వేసే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు పూజాలు నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను దేవరపెట్టెకు చేర్చారు. బుధవారం దేవరపెట్టెను తిరిగి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఇంటికి తరలింపుతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యుడు ఈదుల కృష్ణయ్య తెలిపారు.

కనుల పండువగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని సీతారాంపురంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి కల్యాణాన్ని మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ప్రదర్శనగా ఆలయానికి చేరుకుని స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా జలబిందెలతో అంకమ్మతల్లికి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అద్దంకి సైదేశ్వరరావు, ఉప సర్పంచ్ జానకిరాములు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' పేదలకు ఉపయోగకరం



కోదాడలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కోదాడ : పేదలకు కంటి వెలుగు పథకం ఎంతో ఉపయోగపడుతుందని, దీనిని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ పట్టణ పరిధిలోని 21వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని అన్ని వార్డులలో దశల వారిగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్‌చక్రవర్తి, బంకా వీరేంద్రనాథ్, కౌన్సిలర్ కట్టెబోయిన జ్యోతి, నాయకులు రాయపూడి వెంకటనారాయణ, కట్టెబోయిన శ్రీనివాస్, యాతాకుల మధుబాబు, మంగ, రూపవతి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కాగితరామచంద్రాపురంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు పథకం లక్షల మందికి ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, సర్పంచ్ మంచికంటి వెంకటరెడ్డి, ఎంపీటీసీ మాలతి, వైద్యాధికారులు డాక్టర్ లక్ష్మీప్రసన్న, అనిత, శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎంలు గీత, రమాదేవి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేజన ఫౌండేషన్ సేవలు అభినందనీయం



చిలుకూరు : విద్యార్థులకు డిజిటల్ స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు, హెచ్‌ఎం

కోదాడఅర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సర్వేజన ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని కోదాడ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్‌జీ శివకుమారి అన్నారు. మంగళవారం పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు డిజిటల్ స్టడీ మెటీరియల్‌ను ఆ ఫౌండేషన్ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. స్టడీ మెటీరియల్ అందించిన ఫౌండేషన్ చైర్ పర్సన్ బండారు కవితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎంఎల్ఎన్‌రెడ్డి, ప్రసాద్, జనార్దన్, ఉపాధ్యాయులు షేక్ సలీమా, పుణ్యవతి, మీనాక్షి, పద్మ, లత పాల్గొన్నారు.

డిజిటల్ స్టడీ మెటీరియల్ పంపిణీ

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం సర్వేజన ఫౌండేషన్ చైర్మన్ కవితాఅమరేందర్‌రెడ్డి అందజేసిన స్టడీ మెటీరియల్‌ను సర్పంచ్ పగడాల పద్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యుడు ఎంఎల్ఎన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటాచార్యులు, వీరబాబు, ఉపాధ్యాయులు చందూలాల్, బ్రహ్మం, రాజు, శంకర్, రజిని, మల్లేశ్వరరావు, పాల్గొన్నారు.

చిలుకూరు : మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం సర్వేజనా ఫౌండేషన్ వారు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎల్ఎన్‌రెడ్డి, కమిటీ వ్యవస్థాపకురాలు బండారు కవిత, ప్రధానోపాధ్యాయుడు గుజ్జుల నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు టీవైఎల్ఎన్‌స్వామి, చందా రాములు, వెంకట్‌రెడ్డి, వెంకన్న, పార్వతమ్మ, అరుంధతి, సునీత, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డీతో సహా రుణమాఫీ నగదు చెల్లించాలి

గరిడేపల్లి : ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం వడ్డీతో సహా రుణమాఫీ నగదును చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గానుగుబండ గ్రామంలో జరిగిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌పై రోజురోజుకు ప్రజలకు నమ్మకం పోతోందని ఆరోపించారు. సమావేశంలో మండల పార్టీ కార్యవర్గ సభ్యుడు కడియాల అప్పయ్య, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ తిరుపతయ్య, అంజనేయులు తదితరులున్నారు.